# జీవిత మకరందం

"ఆన్ హ్యాండ్ ఎన్ని ఉన్నాయి?" మహదేవుని ప్రశ్న.

"ఆ! ఉంటానికి చాలా ఉన్నాయి. ఓ మోస్తరుగా ఉన్నవి మటుకు ఓ నాలుగున్నాయి." చప్పరించేశాడు సదాశివం.

"ఆ నాలుగు ఏంటి గురూ!" కుతూహలం ఆపుకోలేకపోయాడు.

మహదేవుడు, సదాశివం మిత్రులు. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు వచ్చి వేరు వేరు ఊళ్ళల్లో పని చేస్తున్నా సెలవులకి తమ ఊరికి వచ్చి కల్సుకుంటూ ఉంటారు. ఇద్దరూ పుట్టింది ఒకే ఊళ్ళో కాబట్టి తరచుగా కలుసుకోవాల్సి వస్తూ ఉంటుంది ఏవో ఒక పనుల మీద.

ఒకే ఈడు వాళ్ళయినా మహదేవుడు కుటుంబీకుడు అయిపోయి కూడా చాలా కాలమైంది. అతని పెద్ద పాప ఏడవ క్లాసు చదువుతున్నది. రెండవ పాప ఐదో క్లాసు. మూడవ వాడు మూడో క్లాసు. భార్య ఓ బ్యాంకు క్లర్కు.

సదాశివం మటుకు బ్రహ్మచారిగానే ఉన్నాడు. బ్రహ్మచర్యం అతని దీక్షకాదు. బలవంతపు బ్రహ్మచారి! అట్లాగని అతనికి కాలు చేయి వంకరగాదు. ఉద్యోగం కూడా సలక్షణమైందీ... ఓ బ్యాంకులో ఆఫీసరిస్తున్నాడు కూడా. ఇంతచేసి అతగాడు పెళ్ళి పెటాకులు లేకుండా ఎందుకు ఉండవలసి వచ్చిందంటే పెద్ద విషాదగాథ అవుతుంది.

సదాశివం వాళ్ళ తల్లిదండ్రులకు లేకలేక ఆలశ్యంగా పుట్టాడు. ఆ తరువాత ఇద్దరు పుట్టారనుకోండి... కాని మొదటి బిడ్డ కావడంతోటి అపురూపంగా పెంచారు..... ముద్దుచేశారు, ముద్దుగా మటుకు తయారుకాలేదు కాని, వాళ్ళకు తీరనికోరికలన్నీ తీర్చుకుందామనుకున్నారు.

ఒక్కొక్కరు ఒక్కొక్క ఆశపెట్టుకున్నారు.

ముఖ్యంగా అబ్బాయికి పెళ్ళయితే బోల్డు కట్నం వస్తుందని తండ్రి ఆశపెట్టుకున్నాడు. బోల్డు బంగారం వస్తుందని తల్లి ఆశిస్తున్నది. వదిన మంచిగా ఉండాలి బాగా చదువుకోవాలని అతని చెల్లెలు అనుకుంటున్నది. ... బాగా ఆస్తిపరురాలై ఉండాలని తమ్ముడు ఆశిస్తున్నాడు. ఇంక కుందనపుబొమ్మలా ఉండాలని సదాశివం సదా కలలు కనేశాడు కూడా. కాని బీదరికంలో పెరిగిన అతని బాల్యం, అమ్మాయి ఐశ్వర్యవంతురాలైనా కావాలి – లేదా మంచి ఉద్యోగస్తురాలైనా కావాలి అని ఘోషిస్తున్నది.

ఈ కోరికలు చాలవన్నట్టు వాళ్ళకు సలహాలు ఇవ్వడానికి దగ్గర బంధువులున్నారు – స్నేహితులున్నారు. ఏతావాతా అందరి కలల సమాహారం సదాశివంకు రాబోయే వధువు.

అందుకని ఓ పట్టాన ఏ సంబంధమూ నచ్చడం లేదు.

ఉద్యోగం వచ్చి – పెళ్ళి చేసుకుంటాడన్న సూచనరాగానే పెళ్ళిళ్ళ పేరయ్యలు కాళ్ళకు బలపాలు కట్టుకుని అతని చుట్టూ తిరిగారు. బాగానే చూపించారు అమ్మాయిల్ని. కాని డిటెక్టివ్‌లాగా వాళ్ళల్లోని లోపాల్ని వెదికి మైక్రోస్కోప్‌లో మరీ చూపించేవాడు సదాశివం. పోనీలే కాస్త బాగానే ఉందనుకునే సమయంలో తల్లిదండ్రులు తమకున్న వీటో హక్కును ఉపయోగించే వారు.

ఇలా గుండెలమీద కుంపటిలాగా – ఆ ఊరి గ్రామ దేవతకు బరువై మిగిలిపోయాడు సదాశివం.

స్నేహితులు కల్సినప్పుడు సంబంధాలు ప్రోగ్రెసు రిపోర్టు తీసుకుంటూ ఉండేవాళ్ళు. చేతిలో ఎన్ని సంబంధాలున్నాయి – ఇంకా దూరంగా ఉన్నవి ఎన్ని, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని, వగైరా వగైరా.

'ఆన్ హ్యాండ్' ఎన్ని ఉన్నాయి అని మహదేవుడు అడగడంతో ఇంత ఫ్లాష్ బ్యాక్ ఉంది.

"ఆంధ్రదేశం గొడ్డుపోయినట్టుంది - సరైన సంబంధాలే దొరకడం లేదు... ఇంక పొరుగు రాష్ట్రాలకు పోవల్సి వచ్చేలాగుంది" చెప్పాడు సదాశివం దిగులుపడ్తూ.

"అదేంమాట! పేపరులో ఓ ప్రకటన ఇవ్వలేక పోయావా?"

"ఆ! అదీ అయింది... అన్నీ కుంటివి గుడ్డివి సంబంధాలు... విడోలు - డైవర్స్డ్ కేసులు కూడా వచ్చాయి."

"దాన్ని బట్టి మనం ఏ లెవల్లో ఉన్నామో తెలుస్తున్నది. అయినా వితంతువులు - విడాకులు తీసుకున్న వాళ్ళు కూడా స్త్రీలేకదారా! నీకు శ్రమ లేకుండా పిల్లలు కూడా కొందరికి ఉంటారు - రెడీమేడ్ - కొంచెం విశాల హృదయంతో ఆలోచించు"! ఓదారుస్తూ సలహా ఇచ్చాడు మహదేవుడు.

"అఫ్‌కోర్స్! అంతా బాగానే ఉంటుంది - కాని వెధవది - మన సొసైటీకి అంత విశాల హృదయం లేదు కదురా! ఏదో వంకపెడుతుంది. ఎగతాళి చేస్తుంది." సదాశివం చెప్పాడు బాధగా.

"సో! నీ వరకయితే ఫర్వాలేదా."

"నాకు సరే... కాని ఇంట్లో ఒప్పుకోరుగా వాళ్ళకు ప్రిస్టేజి సమస్యలు ... అందుకే ఫ్రెష్ వాళ్ళకోసం చూస్తున్నాను."

"ఈ వయసులో నీకు కనీసం ముప్పయి ఏళ్ళు పైబడిన అమ్మాయి అయితేనే సరిపోతుంది."

"కాని దొరకడం లేదు- ఆ వయసు వచ్చేదాకా ఆగడం లేదు."

"పోనీ పదిహేనేళ్ళ అమ్మాయిల్ని ఇద్దర్ని చేసుకో!" నవ్వుతూ చెప్పాడు.

"నాకభ్యంతరం లేదనుకో- కాని దొరికిచావరు-అయినా మీ ఊరి నుండి ఒక్క సంబంధం కూడా తీసుకురాలేదు ఇంతవరకు."

"బాబూ! నీ ఒక్కడికి పెళ్ళి చేసే బదులు పది మంది ఆడపిల్లలకు పెళ్లి చెయ్యొచ్చు. అయినా తాత ఆ రాత రాశాడో లేదో ఓ సారి చూపించుకో!" సలహా పారేశాడు.

"లేదు గురూ! శని నడుస్తున్నది..."

"ఆహా! అయితే గ్రహశాంతులు - పూజలు చేయించుకో!"

"అవి అయిపోయాయి."

"టైం రావాలి. ఇంతకూ ఏ సంబంధమూ నచ్చలేదా ఉన్న వాటిల్లో."

"కొంచెం కొంచెం... నాలుగున్నాయి - కాని నాలిగింట్లో ఏదో ఒక లోపం ఉంది."

"వివరంగా చెప్పు."

"సావిత్రి చాలా బాగుంది... అమ్మాయిని చిదిమి దీపం పెట్టుకోవచ్చు... కాని... కట్నం చాలా తక్కువ! ఒక 'ల' కారమే ఇస్తామన్నారు... రాగిణి ఓ మాదిరిగా ఉంది... కట్నం ఓ మాదిరిగా ఇస్తారు. మాలతి పొట్టిగా వుంది... కట్నం మటుకు మనం ఎంత అడిగితే అంతిస్తారు. మాధవి బాగానే ఉంది... మంచి ఉద్యోగం ఉంది... కాని వాళ్ళ తల్లిదండ్రుల బాధ్యత మనం తీసుకోవాలి..." ఇలా చెప్పుకుంటూ పోయాడు సదాశివం.

"మరి ఇంక సమస్య ఏంటి - ఆ నలుగురిలో ఒకళ్ళని కట్టుకో... ఆలశ్యం అమృతం విషం?"

"వాళ్ళు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కళ్ళకి నచ్చారు. రాగిణి మా నాన్న గార్కి నచ్చింది. మాలతి మా అమ్మకు నచ్చింది. మాధవి మా చెల్లెలుకు నచ్చింది."

"మరి నీకు ఎవరూ నచ్చలేదా?"

"ఆ! నచ్చింది సావిత్రి – కాని కట్నం కష్టంగా ఉంది."

"డబ్బుదేముంది – ఇవ్వాళ కాకపోతే రేపు సంపాదించుకోవచ్చు... కాని అమ్మాయిని సంపాదించుకోలేం!" మహదేవుడు.

"అందం శాశ్వతమా అంటున్నారు". నసిగాడు సదాశివం.

"డబ్బు శాశ్వతమా అని నువ్వు అడగాల్సింది."

"నా మాట వినరు మా నాన్నకు డబ్బు కావాలి! నాకు అందం కావాలి.....ఎలా!"

"రాజీ పడేంది ఎవరూ పెళ్ళి చేసుకోలేరు. మేమందరం నీలాగా ఆలోచించినవాళ్ళమే... తర్వాత రాజీపడి పెళ్ళి చేసుకోలేదా? సుఖంగా కాపురాలు చేసుకోవడం లేదా?"

"ఆలోచించాలి...పెంచుకున్న ఆశలు ఒక్క సారిగా తెంచుకోవాలంటే అదో బాధ!"

"కాని ఒక్కటి గ్రహించు ...ఇంకో రెండేళ్ళు ఆగితే నిన్ను చేసుకోవడానికి కూడా ఎవరూ ముందుకు రారు – తొందరపడు"... మహదేవుడు సలహా ఇచ్చి చక్కా వెళ్ళిపోయాడు.

సదాశివంకు ఏం చెయ్యాలో పాలుపోవడంలేదు. చేతిలో ఉన్న సంబంధాలు ఏవీ తిరస్కరించకుండా కొత్తవి చూడసాగాడు,ఆశ చెడ్డది.

ఆ రోజు అలివేలు మంగతాయారును చూశాడు.

తాయారుపేరుకు తగ్గట్టుగానే ఉంది – మూర్తీ భవించిన తారుకుండలాగా – నల్లగా నిగనిగలాడుతూ ఉంది. ఒకే కూతురు కావడంతో కాస్త గారాబం ఎక్కువైనట్టుంది – చూపరులకు గాభరా కలిగేలా ఒళ్ళు చేసింది పిప్పిళ్ళ బస్తాలాగా!

జీన్సు సిద్ధాంతంను నిరూపిస్తూ కాస్త పళ్ళు ఎత్తు! వాళ్ళ తాతకు ఎత్తు – మరి తనకేం తక్కువ? తండ్రి అదృష్ట అంతా అతని మెల్ల కన్నులో ఉంది... ఆ మెకు మెల్ల!... ఆమె ఎటు చూస్తున్నదో ఒకపట్టాన అర్థం కాలేదు.

కంఠం కమ్మగా ఉంటుందన్న ఆశతో ఆమెను ఓ పాట పాడమని అడిగారు.పాడుమని నన్ను అడగ వలెనా... అని అందుకుంది... తలుపులు మూసి ఉన్నాయి కాబట్టి బయట్నించి – అట్నించి ఏ జీవులూ లోపలికి పరుగెత్తుకు రాలేదు.

ఆ తర్వాత సదాశివం తండ్రి ఆ కంఠ స్వరాన్ని ఒక ప్లసు పాయింటుగా తేల్చాడు – ఆమె గొంతెత్తితే దొంగలు ఆమడ దూరంలో ఉంటారని.

నడక కూడా ముచ్చటగానే ఉంది కాసింత గున్న ఏనుగును తలపిస్తూ. అందంతో పాటు చదువుకూడా మందంగానే ఉంది. బియ్యే ఐదవ సంవత్సరం చదువుతున్నది.

ఇంత భారీ పర్సనాలిటీకి తగ్గట్టుగా భారీ ఎత్తున కట్నం ముట్టచెబుతాననడంతో గమ్మున కూర్చుండిపోయాడు సదాశివం నీరెత్తినశవంలాగా.ఆమె బరువుకు తగ్గట్టు కట్నమిస్తానన్నాడు కాబోయే మామ... నూరుకిలోలు కాబట్టి పదిలక్షలట!

ఆ మాట వినేసరికి సదాశివం తండ్రి మూర్ఛపోయాడు.

కారణం అప్పటిదాకా అతగాడికి వచ్చిన ఆఫరు మాగ్జిమమ్ నాలుగు లక్షలు మాత్రమే!

అందులో ఒకటే కూతురు. ఆమె తల్లీ దండ్రులు హరీ అంటే మిగిలిందంతా ఆమెకే!

సదాశివం తల్లిదండ్రులకు ఆ సంబంధం ఒప్పుకోకుండా ఉండటానికి పెద్దగా కారణాలు కనిపించలేదు. సదాశివం మటుకు తేరుకున్న తరువాత కొంత టైము కావాలి అని అడిగాడు. ఇంత

భారీ సంబంధాన్ని ఆలోచించడానికి.

"అమ్మాయి లావుగా ఉంది నాన్నా!" నసిగాడు సదాశివం ఇంటికొచ్చిం తర్వాత.

"ఆ మాత్రం లావుగా లేకపోతే ఎలారా! నేటి కాలేజి పిల్లలా పూచిక పుల్లలాగా ఉంటే ఏం బాగుంటుంది." తండ్రి.

"ఈసురోమని ఉంటే దేశం ఏం బాగుపడుతుంది." తల్లి.

"అది కాదు నాన్నా! నలుపు ఇంత నల్లగా ఉంటుందని ఆమెను చూసేదాకా నాకు తెలియదు – కాస్త తెల్లగా ఉంటే బాగుండేది.!" చెప్పాడు సదాశివం!

"తెలుపులో ఏముందిరా! ఏడు వర్ణాల సంకలనమే తెలుపు! మాసిపోతుంది తొందరగా" తండ్రి.

"నిజం... నలుపు మాయదు ... గ్యారంటీ కలరు.. ఫేడు కూడా కాదు ఎండకి" తల్లి.

"ఎత్తు పళ్ళు వికారంగా ఉన్నాయి..."

"దాందేముంది.... మొదట అలా అనిపించినా తరువాత అలవాటైపోతుంది." తండ్రి.

"అది కాదురా – అంతగా వికారం అనిపిస్తే – డెంటిస్టు దగ్గరికి వెళితే ఏదో చేసి బాగుందనిపిస్తాడులే!" తల్లి.

"మెల్ల కన్ను లాగుంది – ఎటో చూస్తుంది."

"గుడ్డి కన్నా మెల్ల మేలు కదురా కన్నా!"

"మెల్ల కన్ను అదృష్టంరా వెధవ!"

ఇలా అతని మనసులోని శంకలన్నింటినీ కకావికలు చేసేవారు తల్లిదండ్రులు.

పది లక్షలు! పెద్ద అక్షరాలతో కాగితం మీద రాసిగోడకు అంటించాడు.

"వెధవా! నువ్వు వెలగబడుతున్న ఉద్యోగానికి ఎప్పుడు సంపాదించాలిరా పది లక్షలు?" తండ్రి.

"మనకెలాగూ ఆస్తిపాస్తులు లేవు... వాళ్ళు ఎంతకాలం బ్రతుకుతారులే – ఆ తరువాత నీదేగదురా ఆస్తి సమస్తం!" తల్లి సత్యం చెప్పింది.

తను అంత ఖరీదు పలుకుతాడని తనకే తెలీదు – అందుకని అతని ఛాతీ ఒప్పొంగింది. కాని – అలివేలు మంగతాయారును చూడగానే లోపలికి వెళ్ళి పోయింది. కొంచెం చెమట కూడా పట్టినట్టుంది ఒళ్ళు.

ఆ రోజు తాయారు గురించి... ఆలోచిస్తూ ఉంటే మాగన్నుగా నిద్రపట్టింది....

కాలచక్రం గిర్రున తిరుగుతున్నది...

పది లక్షలకు ఆశపడి సదాశివం తాయారును పెళ్ళి చేసుకున్నాడు. రోజులు నెలలు సంవత్సరాలు గడిచాయి.

ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. అదేం ఖర్మోగాని ఒక్కరికీ తండ్రి పోలిక రాలేదు. అందరూ తల్లి పోలికే!

ఎలిఫెంట్ పార్కును గుర్తుకు తెస్తూ తల్లీపిల్లలు దినదిన ప్రవర్ధమానమవుతున్నారు.

పెద్దమ్మాయి చింతామణి పెళ్ళీడు కొచ్చిందగ్గర్నుండి ఇద్దరికీ చింత పట్టుకుంది ఆమె పెళ్ళి ఎలా చెయ్యాలని... వస్తున్నారు – చూస్తున్నారు – పోతున్నారు – కనీసం ఓ ఉత్తరం ముక్క కూడా

రాయడం లేదు.

అప్పటికీ కట్నం ముప్పై లక్షలు ఇస్తానన్నాడు. అయినా ఒక్కగానొక్క అమాయకుడు కూడా ఆ ఛాయలకు రావడం లేదు. తాయారుకైతే తాను తయారయ్యాడు కాని తన ముద్దుల కూతుళ్ళకోసం ఒక్క మొద్దు వెధవ రాలేదు.

ఈలోపే రెండవది – మూడవది కూడా పెళ్ళీడు కొచ్చేశారు... ఎన్ని ప్రయత్నాలు చేసినా పెళ్ళి కొడుకులు దొరకడం లేదు. ఆహా! కాలం ఎంత మారిపోయింది.

అందరికీ అందం కావాలి... డబ్బుకు లొంగడం లేదు.

"ఏమండీ! నేను కళ్ళు మూసేలోగా నా చిట్టితల్లి పెళ్ళవుతుందాండి ... దేశం గొడ్డుపోయినట్లు ఒక్కడూ ముందుకు రావడం లేదు .... కావాలంటే కట్నం ఇంకో రెండు ఎక్కువిద్దాం...." కన్నీరు కారుస్తూ చెప్పింది తాయారు.

"ఎలా అవుతుంది! చీకట్లో కల్సిపోయే చిన్నారులయ్యే! దానికి తోడు పెంపకం ఎలాగుంది... ఖడ్గమృగాల్ని పెంచినట్లు పెంచావు... ఎవడికైనా గుండె ధైర్యం కావాలిగా!" ఓదారుస్తూ బాధపడ్డాడు సదాశివం.

"నాన్నా! నాకు పెళ్ళి కావాలి!" చింతామణి మంకుపట్టు.

"మాకూ కావాలి!" జంట స్వరాల రెండవది, మూడవది.

"ఏంటయ్యా! కడుపుకు ఏం తింటున్నావు పెళ్ళీడుకొచ్చిన పిల్లల్ని ఇంట్లో ఉంచుకున్నావు. అసలు మీకు నిద్ర ఎలా పడుతున్నదయ్యా!" ఇరుగు పొరుగు సూటిపోటి మాటలు.

అప్పటికే పెళ్ళిళ్ళ పేరయ్యల చుట్టూ తిరిగాడు కమిషన్ బాగా ముట్టచెబుతానని ఆశపెట్టాడు. అయినా వాళ్ళు తమ అశక్తత తెలియజేశారు – బతికుంటే బలుసాకు తింటామన్నారు చాలా మంది పెళ్ళి కొడుకులు.

ఈ బాధతో సతమతమవుతూ స్లీపింగ్ పిల్స్ మింగేశాడు ఒకరోజు సదాశివం!

"అయ్యో ! సదాశివం – సదా శవం అయిపోయావు కదయ్యా! ఎంత పని జరిగింది". ఎవరో ఏడుస్తున్నారు.

"ఏమండీ – మీరు లేని ఈ బ్రతుకు నాకొద్దు నేను వచ్చేస్తాను మీ వెంట". తాయారు ఆత్మహత్యం చేసుకోబోయింది.

"తాయారు ! వద్దు ! వద్దు ! నువ్వు ఉరి వేసుకోవద్దు ..." సదాశివం గట్టిగాఅరిచాడు.

"ఏంరా వెధవా! ఏంటి పగటి పూట కలవరిస్తున్నావు?" ఎవరో మొహం మీద నీళ్ళు జల్లారు.

సదాశివం తేరుకున్నాడు. అర్థంగాక చూశాడు. చుట్టూతా తల్లిదండ్రులు – చెల్లెలు... ఆ! తాను కలగన్నాడు ఇంతసేపు.

"తాయారూ ఎక్కడ?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"నీ మొహం! తాయారు అంటే ఆ తారుడబ్బానా?" తల్లి అడిగింది.

"ఆ! నా భార్య ... అవును నా పిల్లలేరి?" చుట్టూ చూశాడు.

తండ్రికి ఒళ్ళు మండి చెంపమీద ఒకటిచ్చుకున్నాడు. దాంతో ఈ లోకంలో కి వచ్చి పడ్డాడు.

"హమ్మయ్య ! నాకు పెళ్ళికాలేదు. కదూ?"

"అవును – ఇంతకీ టీలు తాగొద్దురా అంటే వినవు. ఈ పైత్యపు మాటలు ఒకటి, నీకు పెళ్ళి

కాలేదురా," చెప్పింది తల్లి.

"నాన్నా ! నేను ఆ తాయారును చేసుకోను !" గట్టిగా చెప్పాడు.

"ఓరి నీయమ్మా కడుపు బంగారంగాను - పది లక్షలు కట్నంరా ! అప్పుడే దాన్ని ఎలా ఖర్చు చేయాలో ఆలోచించి పెట్టా" తండ్రి చెప్పాడు.

"ఆస్తిరా బాబు - ఆస్తి - మస్తుగా వస్తుంది."

"మస్త్ మస్త్ వద్దు నాకుచేసుకునేది ఒక్క పెళ్లి.డబ్బు- ఆస్తి అంటే సంపాదించికోవచ్చు ... కాని అందం సంపాదించుకోలేం ... ఈ పెళ్ళి విషయంలో నాదే ఫైనల్ నిర్ణయం .. నా మాట మీరన్నా వినండి. లేదా బ్రహ్మచారిగా మిగిలిపోతాను జాగ్రత్త!" వార్నింగ్ జారీ చేశాడు.

కొన్ని రోజులకి మహదేవుడు కన్పించి అన్ హ్యాండ్ ఎన్ని ఉన్నాయి అని అడిగాడు.

సదా శివం తడుముకోకుండా చెప్పాడు నిల్ అని.

"మరి !పెళ్లి చేసుకోదల్చు లేదా !?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ! నిశ్చయించుకున్నా...."

"వార్నీ !ఎవర్నిరా?"

"సావిత్రిని - కట్నం తక్కువైనా ఫర్వాలేదు... అందం అణకువ ఉన్నాయి చాలు.." చెప్పాడు సదాశివం.

"మరి పది లక్షలు -?"

"నిజమే నేను పది లక్షలు తీసుకుంటాను - ఆమెను చేసుకుంటాను.రేపు నా పిల్లలకు ఇరవై ముప్ఫైలక్షలు ఇవ్వాల్సివస్తుంది - ఎక్కడినుంచి తేవాలి ! అందుకే ఈ కట్నాల వేటకు ముగింపు పలక దల్చుకున్నాను. అన్నట్లు నా పెళ్ళికి తప్పకుండా వస్తావు కదూ?"

"ఆ ! అంతకంటే ఇంకేం కావాలి! సదాశివం పెళ్లి కొడుకాయెనే!" మహదేవుడు ఆనందంగా పాడాడు.

"అందమే ఆనందం - ఆనందమె జీవిత మకరందం," టీవీలో పాట వస్తున్నది.

ఇంతలో మహదేవుడికి అనుమానం కలిగింది.

"ఒరే సదాశివం ! ఎప్పుడూ నన్ను నా భార్యను ఉదాహరణంగా తీసుకుని అటువంటి భార్య కావాలనుకునే వాడిని - అంత తొందరంగా సావిత్రిని ఎలా ఒప్పుకున్నావురా?"

"ప్చ్! అవేం అడగమాకు. కొందరు అదృష్టవంతులకు జీవితంలో అన్నీ సమకూరుతాయి. అనుకున్నవన్నీ జరిగిపోతాయి. కాని నాలాంటి దురదృష్టవంతులు పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు అదృష్టం కోసం పాకులాడితే మిగిలేది నిరంతరం విషాదమే! అందుకే సావిత్రికి మీ ఆవిడంత మంచి ఉద్యోగం లేకపోయినా రాజీపడిపోయాను". నిట్టూర్చాడు.

"అది సరే ... లక్షలు ... ఎలా వద్దనుకున్నావు?" చచ్చిన పామును మరింత చంపుతూ అడిగాడు మహదేవుడు.

"మహదేవా! మనం పెళ్ళి చేసుకునేది ఎందుకురా? సుఖపడ్డానికి. జీవితాన్ని ఎంజాయ్ చేయడానికి ! పెళ్ళీ అసలు ఉద్దేశం జీవితాన్ని అనుభవించడానికి అయినప్పుడు ఆ పెళ్ళిని కమర్షియల్‌గా ఆలోచించడం అవివేకం! పెళ్ళితో ఆస్తులు పెంచుకోవాలనుకోవడం విచారించదగ్గ విషయం! జీవిత మకరందాన్ని గ్రోలడానికి తగిన భార్యను ఎన్నుకుంటే చాలు - మిగతా విషయాలు పక్కకి పెట్టి", సదాశివం

చెప్పాడు.

"ఒరే! ఇంత జ్ఞానం నీకెప్పుడు కలిగిందిరా! ఇదే ముందునుంచి ఉంటే నీ జీవితంలో పన్నెండేళ్ళు వృథా అయిపోయేవి కావు!" మహదేవుడు ఆశ్చర్యపోతూ దెప్పిపొడిచాడు.

"నిజమే! అనుభవంతో కాని తత్త్వం బోధపడదు కదా!" వేదాంతిలాగా అన్నాడు సదాశివం.

(24 డిసెంబర్, 99 ఆంధ్ర జ్యోతి సచిత్రవారపత్రిక)

